
# సుబ్బారావు పెళ్ళి



— ఘంటసాల సరళాదేవి

సుబ్బారావు చిటపటలాడుతున్నాడు నిప్పులో వుప్పులాగా.

"అమ్మా! నా వివాహ విషయంలో మటుకు నీ మాట వినను. మామయ్య కూతురు లక్ష్మికి, నాకు చుక్కెదురు! నా మాటంటే యే మాత్రం లక్ష్యం లేదు నీ మేనకోడలికి".

"సుబ్బన్నా. ఆ మూడు ముళ్ళు పడితే అదే నీ దారికొస్తుందిరా".

"ఆ...ఆ... మూడు ముళ్ళు పడిన మర్నాడు నీకు, నాకు మారామూళ్ళు పెడ్తుంది చూస్తుండు!"

"సుబ్బూ! నోరులేని గోమాతరా లక్ష్మి దాని గుణం ఇంతప్పటి నుంచి తెలుసు నాకు".

"ఔను! బస్తీగోమాత! లారీలొచ్చినా, లాటీలతో వున్న పోలీసులొచ్చినా, దారి కడ్డంగా నిల్చుంటుంది. ఇదినా రోడ్డు అని మొండి వైఖరి ప్రదర్శిస్తూ"

"నువ్వెన్నన్నా చెప్పు! బ్రహ్మ మీ ఇద్దరికీ రాసి పెట్టాడు".

"రాసి పెట్టాడే! లౌడు స్పీకర్ల ముఖాల దేముడు. పాపం ముసలాడైపోయి, మతిలేక, కొంతమంది అమ్మాయిలకు వివాహం అనే మాట వ్రాయ మర్చి పోతున్నాట్ట. కాబట్టి ఆ లౌడు స్పీకర్ల ముఖాల దేముడి వ్రాతకు విలువ లేదు".

ఇంతలో' సుబ్బారావు మామయ్య రానే వచ్చాడు.

"వింటున్నారా సుబ్బాయి! తెగిన బల్లి తోకలా వూగి పోతున్నావేమిటి? బజారుకెళ్ళి ఒక్క వస్తువు బేరం చేసి తీసుకురాలేవు. గట్టిగా మాట్లాడితే ఎదురు సమాధానం చెప్పలేని చవటవి. నీకు పిల్లనె వరిస్తారా? మా చెల్లెలు ముఖం చూసి పిల్లనిద్దాం అనుకుంటున్నా గాని" "ఔను మామయ్య! నాకు కొన్ని నియమాలున్నాయి. బేరం ఆడనని కాశిలో శివుడి మీద. ఎవరితో వాదానికి దిగనని తర్క శాస్త్రజ్ఞుల మీద ప్రమాణం చేశాను. అట్లా చేయ డానికి కూడా మీరే కారకులు! ఒకసారి అత్తయ్య వంట మనిషిని తీసుకు రమ్మంది. నరేనని వెళ్తుంటే వెనక నుండి నన, 'ఆవిడ యెంత చెప్పితే అంతే ఒప్పుకోకు. బేరం చేయి" తీరా ఆ వంట మనిషి డబ్బు జాస్తిగానే అడిగింది.

'అదేమిటండీ అంత ఎక్కువ చెప్తారు. పెళ్ళిళ్ళ సీజను కాదు గదా! డిమాండేముంటుంది మీకు అన్నాను.

"దానికి మండిపడి, "మాకెప్పుడూ డిమాండే నాయనా! మొన్న నీలాగానే గీసి, గీసి బేరమాడి ఇంటికి వెళ్ళాడు. ఇంతలో యేమొచ్చిందో ఠకీమని చచ్చి వూరుకున్నాట్ట. మా కోసం కబురురానే వచ్చింది. మంచికి, చెడుకి మేమేగా గతి. ఏదీ పది మందికి వండమను మీ ఆడాళ్ళని. షేప్ జాకెట్లు వేసుకుని షోగ్గా తిరుగుతారు. ..."అని ఇంకా ఎలా దులిపేసిందిలే.

"ఇంకొకసారి అద్దెకున్న వాళ్ళు వెళ్తూవూల కుండీల్లోకి మన్ను తవ్వి నిండా పోసుకుంటున్నారు. అత్తయ్య పిల్చి 'సుబ్బన్నా! బంది పాతిక రూపాయిలు చేసి తోలించాను. మట్టి తవ్వుకు పోతున్నారు. కుదరదని గట్టిగా చెప్పు అంటూ ఒకటే నతాయింపు. మన ఇల్లే కదాని ధైర్యంగా డబాయించాను. వాళ్ళకేమో తగని కోపమొచ్చింది.

'సుబ్బారావు! నీ మట్టిమీద నీకెంత ఆపేక్ష! నీ మట్టేనని నాకు తెల్సులే. నీ మట్టి ఇక్కడే పోగేస్తా! అంటూ పూలకుండీలు భళ్ళన బద్దలు కొట్టాడు. ఆ విసురుకు మట్టి నా పాంటు, ముఖం మీద పడేట్లుగా విసిరారు కుండీలని.

"ఓరి పిచ్చి సుబ్బూ! మన సొమ్ము మనం కాపాడుకోవడంలో అవమానం జరిగినా, అవమానం కాదు అనుభవం అని సరిపెట్టుకోవాలిరా! ఒరేయ్ చవటా పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టు! మీ అత్తయ్య నాకు పరాయి సంబంధమే గదా! ఏదో ఆ రోజుల్లో సర్దాపడి రెండు తెల్లచీరలు కొనుక్కొచ్చారా సాయంత్రాల్లో కట్టుకుంటుందని. వాటిని చూసి ముఖం ముడుచుకుందిరా!

'చాల్లెండి యీ సంబరాలు! అత్తయ్య, మామయ్య ముందు, బావగార్ల ముందు తెల్ల చీరలు సింగారిస్తానా? బుద్ధీ, బుర్రా నాకున్నాయిలెండి, అంటూ ఆ చీరలు కాస్తా దుప్పట్లుగా వేసిందిరా! ట్రాజెడీ యేమిటంటే నే తెచ్చిన చీరలు మీ అత్తయ్య కట్టక పోగా దాని చీరలోనే కట్టుకోవాల్సి వచ్చేదిరా! మీ అత్తయ్య కాపురానికి వస్తూ, పాడి ఆవుని, పొట్ల గేదెని వెంట తెచ్చుకుంది. అవి రెండూ ఆవిడకు తప్ప యెవరికీ పాలీయవు. ఈవిడ చీటికి, మాటికి పుట్టింటికి పరుగెత్తటం. మీ అత్తయ్య చీరలు నే కట్టుకుని, తలనిండా ముసుగు వేసుకుని పాలు తీసే వాడిని. మధ్యమధ్య ఆ చీరలు వాసన చూస్తూ అవి పాలి వ్వడం! నేను హడిలి పోతుండే వాడిని ఎక్కడ నన్ను గుర్తిస్తాయో అని.

"భార్యాభర్తలు 'కాంప్రమైజ్' అవడంలోనే ఆనందం వుందిరా!" అంటూ లేచి చక్కాపోయాడు.

"నాన్నా! సుబ్బూ. చిన్న మామయ్య కూతుర్ని చేసుకుంటావా" అమాంతం తల్లి కాళ్ళ మీద పడ్డాడు.

"అది కాదమ్మా! నా మనసు అర్థం చేసుకో. చిన్న మామయ్య తన హోమియో వైద్యానికి నన్ను



బలి తీసుకున్నాడమ్మా!

"తలనెప్పితో బాధ పడ్డాను ఒక రోజు. ఇంక ప్రశ్నల వర్షం కురిపించాడమ్మా" నా తండ్రి, తాతల, ముత్తాతల జీవిత చరిత్ర అడిగాడు. నాకు తెలిసిన వివరాలు చెప్పాను. నన్ను గురించి ఆరా తీయడం మొదలు పెట్టాడు.

'ఏరా! నీకు ఆకలిగా వున్నప్పుడు భోజనం చేయాలనిపిస్తుందా? నీరసంగా మంచం మీద పడుకోవాలనిపిస్తుందా!

నీకు యే యే భాగాల్లో చెమట ఎక్కువ పోస్తుంది? అప్పుడు స్నానం చేయాలనిపిస్తుందా? ఫ్యాన్ వేసుకు కూచోవాలనిపిస్తుందా?' అయ్య బాబో ఆ ప్రశ్నలకి సమాధానాలు నా దగ్గర లేవు! ఆ గుమ్మం తొక్కనని ఆ నాడే నిర్ణయించుకున్నాను.

"నీ ఇష్టం నాయనా! నీతో వాదించలేను".

సుబ్బారావుకు పట్టుదల హెచ్చింది! అందరూ తనని తెలివి తక్కువ వాజమ్మ క్రింద కడుతున్నారని, ముఖ్యంగా అత్తయ్య, మామయ్య దృష్టిలో హీరోలాగా కనపడాలని తెగ తాపత్రయం పడ్తున్నాడు.

ఒకనాడు మంచినీళ్ళకని వంటింట్లోకి వెళ్ళాడు. సంజె చీకట్లు అలముకుంటున్నాయి! రేడియో వారు 'పంది వారు'ని గూర్చి ప్రసంగిస్తున్నారు. గడ్డి వాము చాటు నుంచి సుబ్బారావు అత్తయ్య శరవేగంతో పరుగెత్తుకొచ్చి కూలబడింది. ఆయాసంతో రొప్పుతోంది.

"అత్తయ్యా! భయపడకు!నే వస్తున్నాను" అంటూ పరుగెత్తికెళ్ళి దొంగ దొంగ పట్టుకోండి అంటూ కేకలు పెట్టాడు. సుబ్బారావు, మామయ్య, లక్ష్మి వచ్చారు. లక్ష్మి నవ్వాపుకొంటోంది. "ఓరి చెవలాయి! ఎంత పని చేశావురా, మీ అత్తయ్య ఒళ్ళు తగ్గడానికి డాక్టరు సలహా ఇచ్చిందిరా! ప్రతి రోజూ ఒక మైలు దూరం పరుగెత్తవమ్మా! వెనుక దొంగలు తరుముకొస్తున్నట్టుగా అని! ఈ పల్లెటూర్లో ఎక్కడ పరుగెత్తుతుంది. ఈ గడ్డి వాము చుట్టూ పరుగెత్తుతుంటుంది" ఇంతలో జనం లాంతర్లు, కర్రలతో వచ్చి పడ్డారు. "ఏమీ లేదు బాబూ! మా సుబ్బాయికి మతి తప్పింది మధ్య. వెళ్ళిరండి".

"పిల్ల నిచ్చి పెళ్ళి చెయ్యవయ్యా! అన్నీ సర్దుకుంటాయి" అని జనం సలహా.

షాక్ నుంచి కోలుకోని సుబ్బారావు నిజంగానే వెర్రి ముఖం వేశాడు. "మతి తప్పిందని తెలిస్తే పిల్లనెవరిస్తారు! వెంకటమహాలక్ష్మి నాకు తప్పదు!" నిట్టూర్చాడు.

("నవ్వుల పందిరి, ఆకాశవాణి,
విజయవాడ సౌజన్యంతో)



ఏ నిబంధనలూ బంధించలేని
ప్రేమ అనే అనుబంధం గురించి
తనదైన శైలిలో-
తనకి మాత్రమే పరిమితమైన శిల్పంతో-
మీ ముందుకు వస్తున్న

కొమ్మనాపల్లి
గణపతిరావు

వలదన్నా
వినదీ మనసు

సీరియల్ అతి త్వరలో ప్రారంభం!